

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 104 | గురువారం | 19 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



## బీ-ఫామ్ అందుకున్న శ్రీహరి

స్టేషన్ ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న కడియం శ్రీహరి గురువారం హైదరాబాద్ లో ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నుంచి బీ-ఫామ్ అందుకున్నారు. విజేయుడిగా తిరిగి రావాలంటూ కడియం శ్రీహరిని సీఎం ఆశీర్వదించారు.

-వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్



# బీజేపీ సెల్ఫ్ డిఫెన్స్

**బెడిసికొడుతున్న కమలనాథుల వ్యూహం?**

**కాంగ్రెస్‌ను ఓడించేందుకు తనకు తానే సైలెంట్**

**మూడో స్థానానికి పడిపోయిన గ్రాఫ్**

**అయోమయంలో కార్యకర్తలు**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్ డౌన్ ప్రారంభం కావడంతో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల్లో చావో రేవో తేల్చుకునేందుకు వ్యూహాత్మక ఎత్తుగడలతో ముందుకు వెళుతున్నాయి. బీజేపీ మాత్రం అందుకు భిన్నంగా తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుని సెల్ఫ్ డిఫెన్స్‌లో పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ మరింత బలపడే అవకాశం ఉందని భావించిన బీజేపీ తనకు తానే సైలెంట్ అయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు అడ్డుకట్ట వేయడం ద్వారా ఆ పార్టీ మరింత బలహీనపడుతుందని, దీని ప్రభావం కేంద్రంలోనూ కనిపిస్తుందన్న కుట్రలో భాగంగానే బీజేపీ చీఫ్ బండి సంజయ్ ని తప్పించారన్న విమర్శలున్నాయి. అయితే బీజేపీ సెల్ఫ్ డిఫెన్స్ కావడానికి బీఆర్ఎస్‌తో కుదుర్చుకున్న చీకటి ఒప్పందమే కారణమన్న ప్రచారం సాగుతోంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ మూడో స్థానానికి పడిపోయింది.

వివరాలు 2లో..

– వరంగల్ వాయిస్ ప్రతినిధి





## కాంగ్రెస్ సర్కార్ ఖాయం

**కార్నర్ మీట్‌లో జోష్‌గా ప్రసంగించిన రాహుల్ గాంధీ**

**మేడిపల్లి నుంచి గారేపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ**

**బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలపై విసుర్లు**

8లో..

## రాహుల్ పర్యటనలో అపశ్రుతి



**కొండా సురేఖకు గాయాలు**

**ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు**



# బీజేపీ సెల్ఫ్ డిఫెన్స్

**బెడిసికొడుతున్న కమలనాథుల వ్యూహం?**

**కాంగ్రెస్‌ను ఓడించేందుకు తమకు తానే సైలెంట్**

**మూడో స్థానానికి పడిపోయిన గ్రాఫ్**

**అయోమయంలో కార్యకర్తలు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా చేయాలన్న కమలనాథుల వ్యూహం బెడిసికొట్టింది. ఇప్పటికే కర్ణాటకలో బీజేపీని మట్టికరిపించి అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కూడా విజయం సాధిస్తే దక్షిణాధిలో ఆ పార్టీ హవా కొనసాగుతుందని భావించిన బీజేపీ సెల్ఫ్ డిఫెన్స్ ను అస్త్రంగా ఎంచుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో దీని ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్న గుబులు కాశాయం నేతల్లో నెలకొంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేయడం ఒక్కటే మార్గంగా ఎంచుకున్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రధాన పార్టీగా ఎన్నికల బరిలో నిలిస్తే త్రిముఖ పోటీలో కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగే అవకాశం ఉందని భావించిన పార్టీ పెద్దలు తమకు తాముగా సైలెంట్ అయిపోయారన్న విమర్శలున్నాయి.




### దూకుడుకు బ్రేక్..

గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ గత కొంత కాలంగా తన దూకుడుకు బ్రేక్ వేసింది. ఎన్నికలు సమీపిస్తుండగా అన్నీ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తుంటే బీజేపీ మాత్రం పీచేమూడ్ అన్నట్లు వ్యవహరించడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. బీజేపీ చీఫ్ గా బండి సంజయ్ ఉన్న సమయంలో అధికార బీఆర్ ఎస్ పార్టీకి బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నట్లుగా ప్రచారం సాగింది. కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు త్వరలోనే స్వస్తి పలుకుతారా అన్నట్లుగా ఊపు వచ్చింది. పట్టణాలే కాకుండా గ్రామాల్లోనూ పార్టీ గ్రాఫ్ ఊహించని విధంగా పెరిగింది. ముఖ్యంగా యువత, నిరుద్యోగులను బీజేపీ ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో అన్ని వర్గాలవారు బీజేపీకి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. త్వరలోనే వివిధ పార్టీలనుంచి బీజేపీలోకి భారీగా వలసలు ఉంటాయన్న ప్రచారం సాగింది. ఇందుకు తగ్గట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ముఖ్య నేతలు కూడా బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. తర్వాత ఏమైందో ఏమో గాని బీజేపీ చీఫ్ మారిపోయాడు. దీంతో ఆపార్టీ దూకుడుకు బ్రేక్ పడింది. అప్పటి వరకు బీజేపీలో చేరాలని భావించిన ముఖ్య నేతలందరూ దూరమయ్యారు. కార్యకర్తల్లో స్తబ్ధత నెలకొంది. ఎక్కడి వారు అక్కడే సైలెంట్ అయ్యారు. దీంతో రోజురోజుకూ ఆ పార్టీ గ్రాఫ్ కొద్ది కొద్దిగా పడిపోతూ వస్తోంది.

### ఖరారుకాని అభ్యర్థులు..

ఇప్పటివరకు బీజేపీ తరపున ఎన్నికల బరిలోకి దిగే అభ్యర్థుల జాబితా ఖరారు కాకపోవడం కూడా బీజేపీ వ్యూహంలో భాగంగానే చెప్పుకుంటున్నారు. ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తారనే సస్పెన్స్ ఆయా నియోజకవర్గాల్లో ఉన్న నేతలను కన్ ఫ్యూజన్ కు గురిచేస్తోంది. అభ్యర్థుల ఎంపికలో ఇంకా చర్చల దశలోనే ఉండడం, అభ్యర్థులను ప్రకటించకపోవడం బీజేపీకి మైనస్ గా కనిపిస్తోంది. అభ్యర్థుల ప్రకటన మరింత ఆలస్యం అవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఆందోళన కనిపిస్తుంది. అభ్యర్థులు ఎవరో తేలితే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజల మద్దతును పొందే ప్రయత్నాలు చేయవచ్చు. అభ్యర్థుల ఎంపిక విషయంలో బీజేపీ అందరికంటే వెనకబడి పోవడం పార్టీ శ్రేణులకు ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలకు దీటుగా పైఎత్తులు వేస్తూ ముందంజలో ఉండాల్సిన బీజేపీ అలా కాకుండా ఇంకా మీనమేషాలు లెక్క పెట్టుకుంటూ అభ్యర్థుల ప్రకటనపై జాప్యం చేయడంపై ఆ పార్టీ నేతలే విమర్శనలు గుప్పిస్తున్నారు.

### ఎవరికివారే యమునాతీరే..

అధిష్ఠానం అజమాయిషీ లేకపోవడంతో నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. టికెట్లకోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు ప్రకటించుకుంటున్న బీజేపీలో అప్పటి ఊపు ఇప్పుడు కనిపించడంలేదు. కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ ఇచ్చినా పోటీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేసే పరిస్థితిలో లేరు. అయితే పట్టణ ప్రాంతాల్లో మాత్రం టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేస్తుకున్న నేతలు తమకు తాముగానే అభ్యర్థులుగా ప్రకటించుకుంటూ డివిజన్లలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో కలిసి ఉంటే కలదు సుఖం అన్న విషయాన్ని పక్కనబెట్టి కుక్కలు చింపిన విస్తరులా తలా కొంతమంది కార్యకర్తలను వెంటేసుకొని నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. దీంతో బీజేపీకి ప్రజల్లో జన భలం లేదన్న సంకేతాన్ని వారు తీసుకొస్తున్నారు.



### దూసుకుపోతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్..

అధికార బీఆర్ ఎస్ పార్టీ అందరికంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో పాటు వారికి బీ ఫారాలు కూడా అందజేశారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో దూసుకుపోతున్నారు. వాడవాడలా, గల్లీ గల్లికి వెళ్లి జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. దీనికి తోడు ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కూడా రోజుకు రెండు నియోజకవర్గాల్లో బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రజలనుంచి మద్దతు కూడగడుతున్నారు. అభివృద్ధి అంటేనే తెలంగాణ అన్న సంకేతాలను ప్రజల్లోకి పంపుతున్నారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వచ్చే ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. బీఆర్ఎస్ పార్టీకి తామె ప్రత్యామ్నాయమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ కూడా ఇటీవల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని సూచించింది. మిగతా అభ్యర్థుల జాబితాను కూడా ప్రకటించి, ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోంది.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

**రంగలీల మైదానాన్ని సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ**

**ఏర్పాట్లపై దసరా ఉత్సవ కమిటీతో చర్చ**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కరీమాబాద్ రంగలీల మైదానంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లు, బందోబస్తుపై గురువారం సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ కమిటీతో చర్చించారు. ఉత్సవాల సందర్భంగా భారీగా హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాల్సిన ట్రాఫిక్ పాయింట్లు, ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్, వివిఐపీల సీటింగ్, బారీకేడ్లు, బతుకమ్మ నిమజ్జనంలో అవాంతరాలు లేకుండా ఏర్పాట్లపై చర్చించారు. ఈవ్ టీజింగ్ జరుగకుండా షీటీమ్స్ తోపాటు తాత్కాలికంగా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని డీసీపీ తెలిపారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాన్ని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ టి.సురేష్, సబ్ ఇన్ స్పెక్టర్లు, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ పి.వెంకన్న, ఉత్సవ కమిటీతో కలిసి డీసీపీ కలియ తిరిగారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న గౌడ్, కన్వీనర్ వొడ్నాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపురి రంజిత్ గౌడ్, వొగిలిశెట్టి అనిల్ కుమార్, పోగాకు సందీప్, డి.వెంకన్న పాల్గొన్నారు.





# భారీగా మద్యం బాటిళ్ల స్వాధీనం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.2.32 లక్షల విలువైన 84 మద్యం బాటిళ్లతో పాటు ఇందుకు ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి వివరాలు వెల్లడిస్తూ.. గత అర్థ రాత్రి ఉర్సు గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద మీల్స్ కాలనీ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో పెద్ద మొత్తంలో మద్యం సీసాలను గుర్తించినట్లు వెల్లడించారు. కారు నడుపుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన మొలగుండ్ల పార్థసారథిని అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో పార్థసారథిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యం వ్యాపారిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

### కిట్స్‌లో రోడ్డు భద్రత అవగాహనా కార్యక్రమం..

కిట్స్ కళాశాలలో ఆదర్శ మారుతీ సుజుకి డ్రైవింగ్ స్కూల్, హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ అద్వర్యంలో రోడ్డు భద్రత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోజరాజు, హనుమకొండ ట్రాఫిక్ సీఐ ఎం.సీత రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులతోపాటు ఎంవీఐ.రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ డీన్ నర్సింహారావు, ఎన్సీసీ న్.సిసి ఇన్చార్జి సతీష్ చంద్ర, ఆదర్శ డ్రైవింగ్ స్కూల్ మేనేజర్ శ్యామ్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్ ఆదేశాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రానున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి కె.శశాంక ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి, మాస్టర్ ట్రైనింగ్ బృందంతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల ప్రత్యేక అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో ఎలక్షన్ కమిషన్ వారు జారీ చేసిన ఆదేశాలను ఎన్నికల ప్రత్యేక అధికారులు, సిబ్బంది అమలు చేయాల్సిన అంశాలను ట్రైనింగ్ బృందం అవగాహన పరచాలని అందుకు సంబంధించిన మెటీరియల్ ను తయారు చేసుకొని ప్రతీ ఒక్క అంశం అందులో పొందుపరచి అధికారులకు అర్థవంతమైన విధంగా తెలియజేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్ అందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ముందుగా శిక్షణ అధికారులు ఎలక్షన్ కమిషన్ కొత్తగా చేర్చిన అంశాలకు సంబంధించిన మాన్యువల్ లో నిశితంగా చదవాలన్నారు. ఎలక్షన్ విధులలో పనిచేసే వివిధ విభాగాలకు చెందిన అధికారులకు, సిబ్బందికి అన్ని రకాల అంశాలు తెలిసేలా బృందాల వారీగా నివేదికలు తయారు చేసి ఇవ్వాలన్నారు. విధులలో ఉన్న అధికారులకు, ప్రత్యేక సిబ్బందికి విధులపై అవగాహన శిక్షణ అనంతరం ఆ అంశాలపై ఏ మేరకు పట్టు సాధించారో పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ ట్రైనింగ్ నోడల్ అధికారి సూర్యనారాయణ, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాదరి బక్కయ్య కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నబోయిన శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండలం అధ్యక్షుడు జెల్ల యాకయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిడుగు రాము పరామర్శించి, ఆర్థిక సహాయంగా రూ. 5,000 అందజేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శనం ప్రశాంత్, పెరుమాండ్ల మహేష్, తెప్ప శ్రీకాంత్, వెంకటయ్య, రాములు, గణేష్, సాగర్, ముకేశ్, సంతోష్, మల్లయ్య, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీ అంబర్ కిషోర్ ఝాను కలిసిన బీఎన్ఆర్కేఎస్ సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతనంగా వరంగల్ పోలీస్ కమిషనర్ రేట్ కు సీపీగా వచ్చిన అంబర్ కిషోర్ ఝాను హనుమకొండ నగరంలో కమిషనరేట్ లో గురువారం బీఎన్ ఆర్ కేఎస్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. బీఎన్ఆర్కేఎస్ రాష్ట్ర కార్యదర్శి పంకెర్ల కుమారస్వామి యాదవ్, హనుమకొండ జిల్లా ఇంఛార్జి మూలవీర నర్సింహులు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొంకూరి ఐలయ్య, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పూసాల సంపత్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ అజీమొద్దీన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి యువత పార్టీలో చేరుతున్నారని పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం గీసుగొండ మండలం నందనాయక్ తండా గ్రామిని చెందిన యువకులు బీఆర్ఎస్ లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ నాయకుల మాటలు నమ్మి యువకులు ఇన్నిరోజులు మోసపోయారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి ముందంజలో ఉంటారన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి యువకుడికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు మరి ఏ ఇతర రాష్ట్రాలలో అమలు కావడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ నాయకత్వం కోరుకుంటున్నారని అన్నారు. ప్రతి యువకుడు పార్టీకోసం సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో బాధవాత్ వెంకన్న జిల్లా గిరిజన విద్యార్థి ప్రెసిడెంట్, భ్యుక్యా శ్రీనివాస్(కాంగ్రెస్ పార్టీ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ ), భూక్యా సుమన్ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్, అజ్మీరా వీరన్న, అజ్మీరా శ్రీనివాస్, బానోత్ సుమన్, బాదవాత్ బాలరాజు, బానోత్ రాహుల్, తిరుపతి, శ్రీను, విజయ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరి లెనిన్ గౌడ్, భూక్యా రాజు, వీరన్న, రవీందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ..

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన సూదాటి రామారావు, తడక బాబురావు కుటుంబాలను గురువారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ మొబైల్ ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయి సేవ ట్రస్ట్ పురుగుట్ట, వడేపెల్లి ఆవరణలో వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ ఆదేశానుసారం ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల పూనుకుంది. ప్రతి నెల గ్రామాలకు వెళ్లి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా నెలకు సరిపడా మందులు అందించటం జరుగుతుందని పాలకవర్గం తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో హనుమకొండ రెడ్ క్రాస్ డాక్టర్లు జె.కిషన్ రావు, డాక్టర్ టి.మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, పవన్, నర్సింహా చారి, పోశాలు గ్రామస్తులు, వృద్ధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో గిరిజనులకు అన్యాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో ఎక్కడ కూడా గిరిజనులకు న్యాయం జరగడం లేదని గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా కార్యదర్శి లావుడియా దస్రు నాయక్ అన్నారు. తమ్మెర భవన్ వరంగల్ సీపీఐ పార్టీ ఆఫీస్ లో గురువారం జరిగిన గిరిజన సమాఖ్య మండల సమావేశానికి లావుడియ దస్రు నాయక్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు చాలా అన్యాయం జరుగుతుందని దస్రు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. 10లక్షల గిరిజన బంధు ఇంకా ప్రకటించలేదని, మూడెకరాల భూమి గురించి అసలు ఊసేలేదని ఆయన తెలిపారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా గిరిజనుల మీద పట్టింపు లేదని మండిపడ్డారు. ఈ సారి ఎన్నికల్లో గిరిజనుల ఓటు విలువ ఏంటో చూపిస్తామన్నారు. మాకు న్యాయం జరగకపోతే ఓట్ల ద్వారా తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశం భూక్యా శివరామకృష్ణ అధ్యక్షతన జరగగా బొడ దేవిక, భూక్యా పార్వతి, నేతావత్ లక్ష్మి, మూడ్ భద్రి తదితరులు పాల్గొన్నారు.

# శంకరమఠంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కేంద్రంలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో శ్రీ శృంగేరి సాంప్రదాయ పద్ధతుల్లో జరుగుతున్న శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం శ్రీ లలితా పంచమి విశేషంగా జరిగింది. సాంప్రదాయనిత్య పూజల్లో భాగంగా గురువారం ఉదయం ప్రధాన అర్చకులు శ్రీ సంగమేశ్వర జ్యోషి అధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, సాయి గణేష్ శర్మ, విశాల్ శర్మ, వివేక్ శర్మలు శ్రీ శారదాంబ అమ్మవారికి, శ్రీ శక్తి గణపతికి, శ్రీ చంద్రమౌళీశ్వర స్వామిఅభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామల శశిధర్, శార్వాణి దంపతులు లలిత హోమం నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సరోజన దంపతులు శ్రీ శారదాంబ అమ్మవారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ శారద అమ్మవారి మహా మంగళహారతుల అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీ శృంగేరి సేవా సమితి సభ్యులు మదన్మోహన్, దేవేందర్, రామారావు, రవీందర్, మహిపాల్, శ్రీధర్, సర్వేశ్వర్, వంశీ, రాజు, సంధ్యారాణి, పద్మ, రమాదేవి, కళ్యాణి, రోజాలు భక్తులకు సేవలు అందించారు. అలాగే సాయంత్రం పెరుమాండ్ల బాబు-శశిరేఖ, సుహాసినీలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అభినవ శుక అన్న వజ్జుల సోమశేఖర శర్మ శ్రీదేవి భాగవతం పురాణ ప్రవచనం చేశారు. రాత్రి తోరణాల పద్మజ శిష్య బృందం భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది.

# పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని మాటేడు గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ –పల్లె పల్లెకు ఝాన్సమ్మ కార్యక్రమంలో భాగంగా బతుకమ్మలతో, బోనాలతో గ్రామ మహిళలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గా మాత ఆలయంలో, వేణుగోపాలస్వామి, శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామంలో కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో చేసింది ఏమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద లక్షల కోట్ల అవినీతి పాల్పడ్డారని, రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేటీఆర్, కేసీఆర్ ఖజానా నింపుకుంటే, పాలకుర్తిలో దగా దయాకర్ రావు మిషన్ భగీరథ పేరుతో నాణ్యతలేని పనులు చేసి వేల కోట్ల రూపాయలు తన ఖజానాలో వేసుకున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో కేడీని, పాలకుర్తిలో ఈ దొంగని తరిమికొట్టేందుకు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంగల్ రావు , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రశాంతి, అమ్మపురం గ్రామ ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర ఎంపీటీసీల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దం విక్రమ్ రెడ్డి, తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షులు రమేష్, యాకయ్య, రాజేందర్, ఇస్తారి, నరసింహారెడ్డి, బొల్లం రాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, మధు,రాంబాబు, లింగస్వామి, కొమరయ్య పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి DoCILE KART యాప్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిత్యం బిజీగా గడుపుతున్న ఈ రోజుల్లో నిత్యావసరాలు కొనడానికి సమయం చాలా కష్టంగా మారింది. ప్రతి రోజు ఉదయం లేవగానే మన ఇంటికి అవసరం పడే 'పాల నుంచి రాత్రి వరకు ప్రతి ఇంటికి అవసరమయ్యే వస్తువులు, వంటకు ఉపయోగించే కిరాణా సామాన్లు, స్టేషనరీ, ఆడవారి కోసం కాస్మొటిక్స్, పండ్లు, తాజా కూరగాయలు, కిరాణం, జనరల్ సామాగ్రిని కేవలం "10"అంటే 10 నిమిషాలలో మీ ఇంటి వద్దకు తీసుకురావటమే మా డూసిల్ కార్ట్ యాప్ ప్రత్యేకత అని సంస్థ వ్యవస్థాపకుడు సీఏ క్రాంతికుమార్, నాగ శృతి తెలిపారు. ఇప్పటి వరకు కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన ఈ సదుపాయం మొట్టమొదటిసారిగా "భారత దేశంలో చిన్న పట్టణాలను అందించటమే ఈ Docile Kart యాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ Docile kart యాప్ మన రెండు తెలుగు రాష్ట్రాలలో "225" కు పైగా స్టార్స్ ని ప్రణాళిక పరంగా ప్రాంభించటానికి సిద్ధపడిందని తెలిపారు. ఇందులో భాగంగా తొలివిడత ప్రయోగం మన వరంగల్ నగరం నుంచి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీ భద్రకాళి మాతా ఆశీస్సులతో వరంగల్ లో మొట్ట మొదటి "9" స్టోర్స్ ను రానున్న 10 రోజుల్లో ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 513కు పైగా ఉద్యోగ అవకాశాలను నగర యువతకు కల్పించడం మరింత ఆనందంగా ఉందని క్రాంతికుమార్, నాగ శృతి అన్నారు.

## అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ సెంటర్ సందర్శన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం హస్పిటల్ అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ సెంటర్ ను వర్ధనపేట్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎన్.గోపాల్ రావు గురువారం సందర్శించారు. ఈ సమయంలో డాక్టర్ ఎన్.గోపాల్ రావు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, తగు సలహాలు సూచనలు , రక్తపరీక్షలు, ఆరోగ్య సలహాలు మందుల పంపిణీ చేశారు. సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత కాన్పుల కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్ పిల్స్, ఇంజెక్షన్ గాని ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి ఆరోగ్యంగా, మానసికంగా, ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు.ఎంజీఎం హాస్పిటల్ అర్బన్ ఫామిలీ వెల్ఫేర్ సెంటర్ సిబ్బందితో సకాల పరీక్షలు చేయించుకొని వారు తెలిపిన ఆరోగ్య అవగాహనను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్వినీ, హెచ్.వీ.రమాదేవి, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు సంధ్య పాల్గొన్నారు.

## రంగనాథ స్వామి దేవాలయంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గలోని ప్రసిద్ధిగాంచిన రంగనాథ స్వామి దేవాలయంలో గురువారం దేవీ నవరాత్రుల పురస్కరించుకొని దేవాలయంలో కొలువైన దేవి మాత వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆడిటర్ గోసికొండ సుధాకర్ శకుంతల దంపతులు అన్నదాతగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, విక్కి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు సుల్తానా సమ్మక్క, వంగరి సమ్మయ్య, కోలా కవిత, మంచాల సృజన, మౌటం శ్రీనివాస్, వీరాటి ప్రకాశ్ రెడ్డి, కూరపాటి రవికుమార్, శనగరం భాస్కర్, ఓర్సు మల్లేశం, తలకోటి రమేష్, జోగయ్య, ధర్మారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** దుకాణాల్లో పని చేసే వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ను కాకతీయ ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నగనబోయిన బాబురావు కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్స్యూరెన్స్, కార్మికుల భద్రత, ఇతర సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ కార్య క్రమంలో కాకతీయ ఆల్ షాప్ వర్కర్ ల యూనియన్ సభ్యులు, లీగల్ అడ్వైజర్ నాయిని రవి, ఎనబోతుల సతీష్, గొల్లపల్లి శ్రీధర్, అన్ని కార్మిక సంఘాల నాయకులు, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేతల ప్రభుత్వం కాదు
## నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ మాటల ప్రభుత్వమని, చేతల ప్రభుత్వం కాదని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. రామన్నపేటలో మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయిని మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలకు తప్ప చేతలకు పనికి రాదన్నారు. అభివృద్ధిలో కానీ, కరెంటు విషయంలో కానీ, సంక్షేమ పథకాల విషయంలో కానీ, వరద ముంపుకు గురై ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడంలో కూడా పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ సంపదనంతా దోచుకు తిన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ రెండు పార్టీలు ఒక్కటేనని, అందుకే ఇంతవరకు లిక్కర్ స్కాంలో కవితను అరెస్ట్ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కాజీపేట బస్టాండ్ ఇవ్వడం లేదు అంటూ ధర్నాలు చేశారు. మరి మీరు అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర ఏండ్లు దాటిందని, మరి మీరు ఏం చేశారని ప్రశ్నించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయిని లక్ష్మా రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్నమల్లు, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని నాగయ్య పల్లి గ్రామానికి చెందిన దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ తండ్రి మాదాసి ఎర్ర సాంబయ్య ఇటీవల మరణించగా గురువారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రైతు బంధు సమితి చైర్మన్ నేరెళ్ల బస్వారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో అసమానతలపై మహనీయుల బాటలో అలుపెరుగని పోరాటం చేస్తున్నాడని, ఈ క్రమంలో ఆయన తండ్రి మరణించడం చాలా బాధాకరమని అన్నారు. మాదాసి ఎర్ర సాంబయ్య నాగయ్య పల్లి గ్రామ మొదటి ఉపసర్పంచ్ గా, మాజీ మంత్రి స్వర్గీయ మాదాటి నరసింహారెడ్డితోపాటు, మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావులకు ముఖ్య అనుచరుడిగా ఉంటూ గ్రామ అభివృద్ధికి ఎనలేని సేవ చేశాడని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాదాసి సార మల్లయ్య, చుంచు కృష్ణమూర్తి, మాదాసి సుధాకర్, డీబీఎఫ్ నాయకులు మేకల సాంబయ్య, గిన్నారపు ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన 20వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రెండ్ల సమ్మయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా పరకాల పట్టణంలోని వారి నివాసానికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్ పరిధిలోని బొల్లికుంట గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బీఆర్ఎస్.నాయకులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, బొజ్జం యాదగిరి కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తూ అకాల మరణం చెందిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చల్లా తెలిపారు. ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో కార్పొరేటర్, బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రాహుల్ గాంధీ, ప్రియాంక వ్యాఖ్యలు హాస్యాస్పదం

### మంత్రి సత్యవతి రాథోడ్, చీఫ్ విప్ వినయ్ భాస్కర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాహుల్ గాంధీ, ప్రియాంక వ్యాఖ్యలు హాస్యాస్పదమని మంత్రి సత్యవతి రాథోడ్, చీఫ్ విప్ వినయ్ భాస్కర్ అన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో రాష్ట్ర గిరిజన,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వం చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతూ కవిత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ములుగు, భూపాలపల్లికి వచ్చి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ నిన్న మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, గిరిజన ప్రాంతమైన ములుగుకు గొప్ప హామీలు ఇస్తారని ఎదురుచూశాం. కానీ, కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా వారి మాటలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇస్తామంటున్నారు.. కాంగ్రెస్ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఉన్న పార్టీ ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలంతా గమనిస్తున్నారు.. నవ్వుకుంటున్నారని అన్నారు. ఈ ప్రాంత అవసరాలు తెలుసుకొని మాట్లాడలేదని, ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే.. కొంతమంది నాయకుల డైరెక్షన్ లో మాట్లాడినట్టుందని విమర్శించారు. పోడు చట్టాన్ని మేమే తెచ్చాం అంటున్నారు.. కాంగ్రెస్ హయాంలో గిరిజనులు, గిరిజనేతరులకు తీవ్ర నష్టం జరిగిందని మండిపడ్డారు. ములుగులో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమైందన్నారు. రాహుల్ గాంధీ మాపై విమర్శలు చేయడం కాదు, గ్రూప్ రాజకీయాలతో ముక్కలవుతున్న నీ పార్టీని చక్కదిద్దుకో ముందు అని చురకలంటించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇక్కడ అమలు చేస్తామంటున్న హామీలను ఎందుకు చేయడం లేదన్నారు. గిరిజనులు, పేదల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని విమర్శించారు. ఇలాంటి నాయకులను నమ్మి ప్రజలు ఓట్లేయరని తెలిపారు. ఢిల్లీ పార్టీలు మన గల్లీ ప్రజలకు అవసరమా అని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బ్రహ్మాండంగా మూడోసారి హ్యాట్రిక్ కొడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్‌కు చల్లా నారాయణ రెడ్డి రాజీనామా



**వరంగల్ వాయిస్, కాటారం :** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణ రెడ్డి గురువారం భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017లో కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ ఎస్ పార్టీలో చేరానన్నారు. అప్పటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు పని చేశానని , కాంగ్రెస్ కంచు కోటలో 2019లో బీఆర్ఎస్ జడ్పీటీసీని గెలిపించుకున్నానని తెలిపారు. అయినా సరైన గుర్తింపు లేదని, ప్రజా వ్యతిరేకత ఉన్న అభ్యర్థికి టికెట్ కేటాయించడం కలిచి వేసిందని, అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని రెండు రోజుల్లో ప్రజలు , కార్యకర్తల అభీష్టం మేరకు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

## గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండల పరిధిలోని సాయిపేట, కేశవనగర్ గ్రామాలలో గురువారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ హయాంలో అధికారంలో ఉన్నప్పుడు దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలలో పెద్దపీట వేసినట్లే రానున్న రోజులలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలకు అమలు చేస్తామనిస్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర అన్నారు. హైదరాబాద్ లో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాగానే అమలయ్యే సంక్షేమ పథకాలను, అదేవిధంగా సోనియమ్మ ప్రకటించిన ఆరుగ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ బాషా, లెనిన్, కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల నాయకులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జంగా రాఘవరెడ్డికే పశ్చిమ నియోజకవర్గం టికెట్ ఇవ్వాలి

### మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్ విజ్ఞప్తి చేశారు. కాజీపేట మీడియా పాయింట్ లో గురువారం కాజీపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్టాడుతూ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు పోటీ చేసి నియోజకవర్గం వదిలిపెట్టి పోయిన తర్వాత 10సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉండి కార్పొరేషన్ ఎన్నికలలో, స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో మాకు అండగా ఉండి మమ్మల్ని గెలిపించారన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ మా సమస్యలు పరిష్కరిస్తూ, మా కష్ట, సుఖాలలో పాలుపంచుకున్న జంగా రాఘవ రెడ్డికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. జంగా రాఘవరెడ్డికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం టికెట్ ఇచ్చినట్లయితే మా బంధువుల ఓట్లు, మా పరిచయస్థుల ఓట్లతో ఆయన్ని గెలిపించుకుంటామని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికైనా వెనుకడుగు వేయమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్, 45వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట్ల రాజు యాదవ్, హసన్ పర్తి మండలం మడిపల్లి సర్పంచ్ చిర్ర రమేశ్, 44వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ స్వామి, 45వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ వస్కుల శంకర్, 64వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బైరి లింగమూర్తి, ఖాజీపేట దర్గా పీఏసీఎస్ మాజీ చైర్మన్, శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ లింగం నరేందర్ రెడ్డి, హనుమకొండ మాజీ అధ్యక్షుడు నర్సింహ రెడ్డి, తరాలపల్లి మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, టేకులగూడెం మాజీ సర్పంచ్ కోర్నెలు, కొండపర్తి మాజీ ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి, ఐనవోలు మండలం ఎంపీటీసీ బీరం మౌనిక దేవేందర్‌రెడ్డి, టేకులగూడెం, కనిపర్తి, నర్సింహోల గూడెం, ములకలగూడెం, గ్రామ శాఖ అధ్యక్షులు, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కొమ్ము.రమేశ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రమోద్, మాజీ కార్పొరేటర్స్, హసన్‌పర్తి మండల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్ లు, వివిధ గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలి

### ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గార్ల, బయ్యారం, మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లనుజిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ లో భాగంగా పోలీస్ స్టేషన్ ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధులను పరిశీలించారు. స్టేషన్ కు సంబంధించిన ఫైల్స్, రికార్డ్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో ఎన్నికల దృష్ట్యా జరిగే నగదు సరఫరాపై పకడ్బందీగా నిఘా ఉంచి నగదు సీజ్ చేయాలన్నారు. రోజువారీగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి ఎలాంటి రిసిప్ట్ లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళుతున్న నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలన్నారు. అక్రమంగా రవాణా అవుతున్న లిక్కర్ ను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను, ఎన్నికలలో గొడవలను సృష్టించే వారిని ముందస్తుగా గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ తరువాత ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, లిక్కర్, బైండోవర్ కేసుల వివరాలను పరిశీలించారు. గత ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్సైలు రోజు గ్రామాలను సందర్శించి ముందస్తు సమచారం తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగే ప్రతి సంఘటనను ఎప్పటికప్పుడు తెలుసుకోగలగాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల పై నిఘా ఉంచాలని, బెల్టు షాపులను నిర్వహించకుండా పూర్తి అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తూ, ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాన్ని సమీపించే దారులను పరిశీలించాలన్నారు. ఆయా గ్రామాలలో ప్రజా ప్రతినిధుల వివరాలు, గతంలో ఎన్నికల సందర్భంగా ఆయా గ్రామాలలో అయిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎన్నికలను ఇన్సిడెంట్స్ ఫ్రీగా జరిగేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.

## విద్యారంగాన్ని విస్మరించిన పాలకులకు బుద్ధి చెప్పాలి



### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోని సమాజానికి ఉపయోగపడడంతో పాటు విద్యార్థులు రాజకీయంగా ఎదుగుతూ విద్యారంగాన్ని విస్మరించిన పాలకులకు బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్టలోని మిత్ర కన్వెన్షన్ హాల్ లో మూడో రోజు ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక, శిక్షణా తరగతుల ముగింపు సమావేశానికి ప్రిన్సిపాల్ గా కె.మణికంఠ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గా బానోతు రఘురాం, కాసోజు నాగజ్యోతిలు వ్యవహరించగా ముఖ్య అతిథిగా కూనంనేని సాంబశివ రావు విచ్చేసి "ప్రస్తుత రాజకీయ పరిస్థితులు -విద్యార్థి, యువత కర్తవ్యాలు" అనే అంశంపై మాట్లాడారు. ప్రపంచంలో జరిగిన అనేక పోరాటాల్లో విద్యార్థులు కీలకపాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ముందు భాగాన నిలిచారని అన్నారు. విద్యార్థులు రాజకీయంగా ఎదుగుతూ విద్యారంగాన్ని విస్మరించిన పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో విద్యను ప్రైవేటీకరించి, పేద, మద్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ లను ఈ ఎన్నికలలో విద్యార్థులు ఓడించాలన్నారు. సమాజాన్ని చైతన్య పరిచేది విద్యార్థులేనని, సమసమాజ నిర్మాణం కోసం ఏఐఎస్ఎఫ్ కృషి చేయాలని కోరారు. మరో అతిథి ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ మొన్న ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల మెనిఫెస్టోలో విద్యారంగం గురించి, నిరుద్యోగ భృతి గురించి ఎలాంటి ప్రతిపాదన లేదని మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు నద్దునూరి అశోక్ స్టాలిన్ "దేశంలో నెలకొన్న విద్యారంగం-దాని పరిస్థితులు" అనే అంశంపై క్లాస్ బోధిస్తూ మాట్లాడుతూ దేశంలో అందరికీ విద్య పేరుతో కొందరికే (కొనగలిగే వారికే) విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ "ఏఐఎస్ఎఫ్ ఉద్యమ చరిత్ర, నిర్మాణం" పై బోధిస్తూ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ అవిర్భవించి దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దేశంలోని మొట్ట మొదటి విద్యార్థి సంఘమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రే భిక్షపతి, మేకల రవి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ , రెహమాన్, నాగ జ్యోతి, సి.రాజు, నెల్లి సత్యా, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వుట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈవీఎం, వీవీ ప్యాడ్ లపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. అసిస్టెంట్ మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఈ ప్రావీణ్య తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఈవీఎం, వీవీ ప్యాడ్ లపై 18మంది అసిస్టెంట్ మాస్టర్ ట్రైనర్స్ కు ఏర్పాటు చేసిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ శిక్షణ పొందిన శిక్షకులు నియోజకవర్గాల వారీగా ప్రతి సెషన్ కు 150 మందికి మించకుండా ప్రీసిడింగ్ ఆఫీసర్లకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు వీవీ ప్యాట్ మిషన్ ల అనుసంధానం, కమిషనింగ్, పోలింగ్ పూర్తి అయ్యాకా సీల్ చేసే విధానం గురించి వివరించాలన్నారు. శిక్షణ పొందిన వారికి 25ప్రశ్నలతో కూడిన క్విజ్ నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ సమయంలో, పోలింగ్ జరిగే రోజు అందుబాటులో ఉంటూ సందేహాలను నివృత్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ బాలకృష్ణ, శ్రీనివాస్ లు ఈవీఎం, వీవీ ప్యాడ్ల నిర్వహణలో తరచుగా వచ్చే సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల నోడల్ అధికారి బాలకృష్ణ, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ సంబంధిత శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కుండె రవి, బోనాల యాకయ్య, మాడుగుల పాల మల్లయ్య, జన్ను రవి, అనిల్, స్వామి, అనుముల కుమారస్వామి, బుర్రి రవి, వైనాల కొమ్మాలు, జినుకల రాజు, ఎరుకల సాంబయ్య లతోపాటు 100 మంది, అలాగే లింగాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూషణబోయిన ఐలయ్య, తలబోయిన రాజు, రాకం కుమార్, రాజబోయిన ఐలయ్య, అన్న కుమారస్వామి, కడిదల కట్టయ్య, వేములపల్లి మనోహర్, మూగల రాకేష్, గుండేటి స్వామి, ఎల్లయ్యగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నూకల ముత్తయ్య, భాషబోయిన చక్రపాణి, పుల్లయ్యబోడు తండా గ్రామానికి చెందిన భోజేర్వు గ్రామ మాజీ సర్పంచ్ గుగులోతు సుందర్, తెలంగాణ ఉద్యమకారులు వంగ సాంబరాజు, ధరంసోతు దస్రునాయక్, నాయకులు కందుల రమేష్, ముడికల కుమారస్వామి, బండి చిన్న సారంగం, రామ్ ధన్, భూక్య అమ్రు, తేజావత్ బీకు, ధారావత్ బాలు, భూక్య బద్రు, వీరు, సురేష్, వాల్యలతో పాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్ యాదవ్, లింగాపురం సర్పంచ్ తప్పెట రమేష్, అమీనాబాద్ సర్పంచ్ సిద్ధన రమేష్, మాజీ ఎంపిటిసి బిల్లా ఇంద్రసేనారెడ్డి, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రూపిక శ్రవణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు, ఎడ్ల నారాయణరెడ్డి, కోనాపురం ఉపసర్పంచ్ మండల నరసింహారాములు, కళ్లెపు రాజశేఖర్, చిప్ప ఈశ్వర్, రాధారపు బిక్షపతి, మచ్చిక కుమార స్వామి, రాజబోయిన దూడయ్య, భూక్య ఈర్య, బుచ్చి రాములు, భిక్షపతి, రమేష్, విజేందర్, ఉప సర్పంచ్ కుసుమ సతీష్, నూకల సాంబరాజు, సారయ్య, యాకయ్య, రంజిత్ పాల్గొన్నారు.

# గణపయ్య మన్నించు..!



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నవరాత్రి పూజలు అందుకున్న తర్వాత నిమజ్జనం చేసిన గణనాథులు నీటిలో మునగకుండా తేలుతూ బయటికి కనిపిస్తున్నాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాలను మండపాలలో ఏర్పాటుచేసి నిర్వాహకులు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారు అమీన్ సాగర్ చెరువులోని మత్తడి ప్రదేశం వద్ద నీటిలో నిమజ్జనం చేశారు. కాని నీటి ప్రవాహం తగ్గడంతో వినాయక విగ్రహాలు నీటిలో కరగకుండా బయటికి తేలుతూ కనిపిస్తున్నాయి. అటువైపుగా వెళ్లిన వారు నీటిలో పూర్తిస్థాయిలో మునగకుండా బయటికి కనిపిస్తున్న ఎనిమిది వినాయక విగ్రహాలను చూసిన ప్రతి ఒక్కరూ వినాయక మన్నించూ..! అంటూ చేతులు జోడిస్తూ మొక్కుతున్నారు.

# కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీల కార్యక్రమాన్ని జనతా పరపతి సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనతా పరపతి సంఘం అధ్యక్షుడు కత్తి సాంబేశం విచ్చేసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు సభా అధ్యక్షతన జరిగింది. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జక్కం దామోదర్, ఎలుగు రవికుమార్, కోల రాము, దున్నాల శ్రీనివాసరావు, ఎం వెంకటేష్ లు వ్యవహరించారు. ఈ పోటీలలో 13గ్రూపులు పాల్గొనగా గెలుపొందిన విజేతలకు సద్దుల బతుకమ్మ రోజున బెస్తం చెరువు వద్ద బహుమతులు ఇవ్వబడతాయని తెలిపారు. పోటీలను ఉద్దేశించి కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు మాట్లాడుతూ తెలంగాణలో మహిళలకు ఎంతో పవిత్రమైన పండుగగా జరుపుకుంటారన్నారు. అందులో భాగంగా మన వరంగల్ జిల్లాలోని రంగశాయిపేటలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో గత 27 సంవత్సరాల నుంచి మహిళలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పాటల పోటీలు దోహదపడతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనతా పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి కేడల మల్లేశం, కోశాధికారి హనుమాన్ల రమేష్, సేవాసమితి సభ్యులు బొల్లెపల్లి రాజు, కత్తెరపల్లి వేణు, అడుపరాజు కుమార్, కొట్టే వినయ్ కుమార్, మండల మురళి, మహిళలు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సుస్థిర పాలన

## మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భారతీయ జనతాపార్టీ పాలకుర్తి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుల సమ్మేళనం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించారు. పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమగ్రాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సుస్థిర పాలన అందుతుందని తెలిపారు. తెలంగాణకు తొమ్మిదేళ్లలో తొమ్మిది లక్షల కోట్లు కేటాయించి తెలంగాణ సమగ్రాభివృద్ధికి మోడీ తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. కేసిఆర్ సర్కారు అన్ని వర్గాలను మోసం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని, ఉచితాల పేరుతో వరాలు కురిపిస్తోందన్నారు. ఈ సమావేశంలో జనగామ జిల్లా ఇంఛార్జి యాప సీతయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రాంమోహన్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వర్, దొంగరి మహేందర్, రంగు రాములు, దుబ్బ రాజశేఖర్, కన్నయ్య, పరుపాటి రాం మోహన్ రెడ్డి, సాయిని ఝాన్సీ, రచ్చ కుమార్, సోమన్న, నరేందర్, మండల అధ్యక్షులు పల్లె కుమార్, బొచ్చు సురేష్, పులిగిల్ల ఉపేందర్, కమ్మగాని శ్రీకాంత్, వడ్లకొండ రవి, బొమ్మనబోయిన సుధాకర్, నాయకులు తళారి సోమయ్య, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, నవీన్, విజయ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** కల్లెడ ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు హాజరై ఆర్చరీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలకు వివిధ మండలాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు సుమారు 60మందికి పైగా పాల్గొనారు. పోటీలలో ఆర్డీఎఫ్ విద్యార్థులు రికర్వ్ విభాగంలో 10మంది, ఇండియన్ రౌండ్ విభాగంలో 11మంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం జరిగింది. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 21, 22న కొల్లూరు ప్రాంతంలో జరగనున్నాయి. ఈ పోటీలకు ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీ నుండి సుమారు 21మంది ఎంపిక కావడం జరిగింది. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఆర్చరీ కోచ్ చందూలాల్, కళాశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం వద్ద గల శ్రీ గణేశ సుబ్రహ్మణ్య సహిత శ్రీ రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. అనంతరం శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వార్త ఆఫీస్ వద్ద ఓం శ్రీ చండీశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద, దేశాయిపేట మున్నూరు కాపు సంఘ భవనంలో ఏర్పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్, అమ్మవారి భక్తులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు



# భర్తతో కాకుండానా..

## 'మరదలితో హనిమూన్ ఏంటి..?

బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. కొద్దిరోజులు క్రితమే ఆప్ యువ నాయకుడు రాఘవ్ చద్ధాతో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో ఆమెకు పెళ్లయింది. వీరిద్దరూ ఛైల్డ్‌హుడ్ ఫ్రెండ్. చాలాకాలంగా ఇద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తోంది. పార్టీలు, రెస్టారెంట్లు అంటూ చెట్టాపట్టాలేసుకున బాగానే తిరిగారు. ఎన్నోసార్లు మీడియా కెమెరాలకు చిక్కారు. గత నెల 24 ఇద్దరూ మూడుముళ్ల బంధంతో ఒకటయ్యారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండే పరిణితి చోప్రా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. రాఘవ్ చద్దాతో పెళ్లి తర్వాత అనంతరం గ్రాండ్‌గా హనీమూన్ ప్లాన్‌ను చేసుకుంటుందని భావించారు అంతా. కానీ పరి మాత్రం భర్తతో లేకుండా మాల్దీవులు వెకేషన్‌కు వెళ్లి బాగా ఎంజాయ్ చేస్తోంది. కానీ ఆమె ఈ వెకేషన్‌కు తన మరదలితో వెళ్లినట్లు తెలిపింది. 'నేను హానిమూన్‌కు వెళ్లలేదు. ఈ ఫోటోను నా మరదలు తీసింది. ఇది గర్ల్స్ ట్రిప్' అంటూ బికినీలో ఉన్న ఒక ఫోటో షేర్ చేసింది. ఆమె చేసిన పోస్ట్ చూసిన అభిమానులు నెటిజన్లు 'మరదలితో హనిమూన్ ఏంటి..? కొత్తగా పెళ్లైన వారు జంటగా వెళ్తే ఆ మధుర క్షణాలు చెప్పలేనివి' అని కొందరు కామెంట్ చేయగా, మరికొందరు పెళ్లై నెల కాలేదు భర్తతో కాకుండా మరొకరితో హనిమూన్ ఎంజాయ్ చేస్తున్నావా' వైరల్ కామెంట్స్ చేస్తున్నారు.



# ఆ ముద్దులో ఆ ఉద్దేశం లేదు

ఇటీవల దర్శకుడు ఎస్.రవికుమార్ చౌదరి హీరోయిన్ మన్నారా చోప్రాను వేదికపై ముద్దు పెట్టుకున్న సంగతి ఎంతగా వైరల్ అయిందో తెలిసిందే! దానిపై దర్శకుడు అప్పుడే క్లారిటీ ఇచ్చాడు. 'అది వేరే ఉద్దేశంతో పెట్టిన ముద్దు కాదని, అయినా ఆమెకు లేని నొప్పిన మీకెందుకు' అంటూ స్పందించిన సంగతి విదితమే! ఇదే విషయంపై తాజాగా హీరోయిన మన్నారా చోప్రా స్పందించారు. తాజాగా హిందీ 'బిగ్‌బాస్ 17'లో ఈమె కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చింది. ?స్టజీపైకి ఆహ్వానం పలికిన సల్మాన్ ఖాన్ ఆ ముద్దు గురించి అడిగాడు. దీనికి బదులిచ్చిన మన్నారా.. అది మీరనుకునే ముద్దు కాదని, ప్రేమపూర్వకంగా ఆయన తనకు పెక్ తరహా ముద్దు పెట్టారని చెప్పింది. అంతే తప్ప ఇందులో వేరే ఉద్దేశం లేదని వివరించింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అంతే కాదు.. మళ్లీ ఆ ముద్దు వీడియోలో నెట్‌లో ట్రెండ్ అవుతున్నాయి. గ్లోబల్‌స్టార్ ప్రియాంక చోప్రాకు బంధువైన మన్నార 'ప్రేమ గీమా జానా నై' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయింది. తర్వాత జక్కన్న, తిక్క, రోగ్, సీత వంటి చిత్రాల్లో నటించింది. అయితే వీటిలో ఏ చిత్రమూ ఆశించిన విజయం సాధించలేదు. తాజాగా రాజ్ తరుణ్తో 'తిరగబడరా సామి' సినిమాలో కీలక పాత్ర పోషించింది. ఎ.ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం టీజర్ వేడుకలోనే దర్శకుడు ఈమెను ముద్దాడాడు.





# 27 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో చంద్రముఖి-2

హిట్టయిన సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతుందంటే జనాల్లో అంచనాలుండటం సహజమే. అందులోనూ ఎవర్‌గ్రీన్ లాంటి చంద్రముఖి సినిమాకు సీక్వెల్ అంటే అంచనాలు ఆకాశాన్నంటుతాయి. పైగా సినిమాల్లో దెయ్యాలకు శరీరాన్ని అప్పుగా ఇచ్చే రాఘవ లారెన్స్ హీరోగా చేయడంతో అటు తెలుగు ఆడియెన్స్‌లోనూ ఈ సీక్వెల్‌పై తిరుగులేని అంచనాలు క్రియేట్ అయ్యాయి. టీజర్, ట్రైలర్‌లు సో సోగా అనిపించినా.. కథ పరంగా ఏదైనా కొత్తదనం ఉంటుందేమో అన్న ఎక్స్‌పెక్టేషన్స్‌తో థియేటర్‌లకు వెళ్లిన ప్రేక్షకులను దర్శకుడు పి.వాసు తీవ్రంగా నిరాశపరిచాడు. కథ, కథనం, టేకింగ్ ఏది కూడా కొత్తగా లేకపోవడం.. పై పెచ్చు గ్రాఫిక్స్ దరిద్రంగా ఉండటంతో జనాలు చంద్రముఖి-2 సినిమాను తిప్పి కొట్టారు. అసలు లారెన్స్ ఈ కథను ఎలా ఒప్పుకున్నాడో అతనికే తెలియాలంటూ ఆయన ఫ్యాన్స్ తీవ్రంగా నిరాశవడ్డారు. అయితే పోటీగా ఎలాంటి సినిమాలు లేకపోవడంతో కొంత వరకు ప్రొడ్యూసర్‌లకు ఈ సినిమా నష్టాలు మిగిల్చింది. ఇక తాజాగా ఈ సినిమా ఓటీటీ డేట్‌ను ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తుంది. అక్టోబర్ 27 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తుంది. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా హక్కులను రిలీజ్‌కు ముందే కొనుక్కోవడంతో నిర్మాతలకు కాస్త కలిసొచ్చింది. చంద్రముఖి సినిమాకున్న క్రేజ్‌తో సీక్వెల్ కోసం నెట్‌ఫ్లిక్స్ సంస్థ భారీ ధరకు డిజిటల్ హక్కులను దక్కించుకుంది. కంగనా రనౌత్ కీలకపాత్ర పోషించిన ఈ సినిమాకు ఆస్కార్ గ్రహీత ఎం.ఎమ్ కీరవాణి స్వరాలు కూర్చాడు. డబ్బులను మంచి నీళ్లలా ఖర్చు పెట్టే లైకా సంస్థ ఈ సినిమాను నిర్మించింది.



# కాంగ్రెస్ సర్కార్ ఖాయం

**కార్నర్ మీట్‌లో జోష్‌గా ప్రసంగించిన రాహుల్ గాంధీ**

**మేడిపల్లి నుంచి గారేపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ**

**బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలపై విసుర్లు**




**వరంగల్ వాయిస్, కాటారం :** ప్రజల సంతోషాన్ని చూస్తుంటే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ సర్కార్ రావడం ఖాయమనిపిస్తుందని ఆ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారేపల్లి కార్నర్ మీటింగ్ లో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలుగులో అనువాదం చేశారు. భూపాలపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి రాహుల్ గాంధీ బస్సు యాత్రలో పాల్గొన్నారు. జిల్లా సరిహద్దుల్లోని మంథని నియోజకవర్గం ప్రారంభం గ్రామమైన మేడిపల్లి నుంచి మంథని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు దుదిల్ల శీను బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ కొనసాగింది. దారి పొడవునా మహిళలు కోలాటాలు, ప్రదర్శనలు, మంగళ వాయిద్యాలు చేస్తూ పూల వర్షం కురిపించారు. బస్సు పై రాహుల్ గాంధీతోపాటు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ తాము ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించినప్పటికీ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఒకే కుటుంబం అధికారాన్ని అనుభవిస్తుందని, అవినీతికి పాల్పడుతూ అరాచకపు పాలనను కొనసాగిస్తుందని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పేద ప్రజలు సంక్షేమం, అభివృద్ధిని కోరుకుంటుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ పర్సంటేజీలతో జేబులు నింపుకుంటున్నాడని దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ ఎస్ మరో పార్టీ ఎంఐఎంలు ఒకే తాను ముక్కల్లా వ్యవహరిస్తున్నారన్నారు. తాను ప్రజా సంక్షేమానికై భారత్ జోడో యాత్ర ప్రారంభించి దేశ వ్యాప్తంగా ప్రజల సమస్యలను గుర్తించామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాష్ట్రంతో పాటు హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ ఘఢ్ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారన్నారు. రాబోయేది కాంగ్రెస్ శకం అని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయల సంపదను దోచుకుందని దుయ్యపట్టారు. బీఆర్ఎస్ నేతలపై, కేసీఆర్ కుటుంబం పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ చేత ఎందుకు విచారణ చేయించడంలేదని ప్రశ్నించారు. దసరా తర్వాత రాష్ట్రంలో ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ పర్యటనలు ఉంటాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, వైస్ ఎంపీపీ సీర్ల తిరుమల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు గౌడ్, ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఎంపీటీసీ, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, పీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, పీసీసీ మహిళా రాష్ట్ర కార్యదర్శి ఆంగోతు సుగుణ, మహాదేవపూర్ ఎంపీపీ బాన్సువాడ రాణి భాయ్, మహా ముత్తారం జడ్పీటీసీ లింగమల్ల శారద,కుంభం స్వప్న రెడ్డి, రమేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మహిళా విభాగం డాక్టర్ ఏలుబాక సుజాత, నాయకులు చీర్ల తిరుపతిరెడ్డి, అజ్మీర రఘురాం నాయక్, మహేష్ రవీందర్రావు, కొట్టే ప్రభాకర్, అంగజాల అశోక్, సాయి, విక్రమ్, నరేష్ పలువురు పాల్గొన్నారు. గారేపల్లి నుంచి బస్సు యాత్ర మలహర్ మండలం కొయ్యూరు మీదుగా మంథని పట్టణం పెట్రోల్ పంప్ వద్ద కార్నర్ మీటింగ్ అనంతరం కమాన్ పూర్ మండలం జేఎన్టీయూ కాలేజీ వద్ద లంచ్ అనంతరం సింగరేణి కార్మికులతో గేట్ మీటింగ్ అక్కడి నుంచి బస్సు యాత్రలో పెద్దపల్లి వరకు చేరుకొని అక్కడ బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. శుక్రవారం కరీంనగర్ నుంచి నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## రాహుల్ పర్యటనలో అపశృతి

**కొండా సురేఖకు గాయాలు**

**ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు**

**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి పట్టణంలో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న బస్సు యాత్రలో కాంగ్రెస్ నాయకురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కాంగ్రెస్ నాయకురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రాహుల్ పర్యటనలో భాగంగా భూపాలపల్లిలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కొండా సురేఖ స్వయంగా స్కూటీ నడుపుతూ పార్టీ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే ఈ ర్యాలీలో వాహనాల ఒత్తిడి కారణంగా ఆమె నడుపుతున్న స్కూటీ అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో కుడి కన్ను పై భాగం, చేతికి గాయాలయ్యాయి. హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స అందించారు.

**కన్నీరు పెట్టుకున్న మురళి..**

రోడ్డు ప్రమాదంలో కొండా సురేఖ గాయపడిన విషయం తెలుసుకున్న ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమెకు తగిలిన గాయాలు చూసి కంటతడి పెట్టుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందంటూ ఆరా తీశారు. సురేఖ ఆరోగ్య పరిస్థితులు నిలకడగానే ఉన్నాయని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఏసీబీ వలలో డీఐసీ మేనేజర్

**రూ.15వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాస్**





**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాతోపాటు ములుగు జిల్లా పరిశ్రమల అధికారి గంగాధర శ్రీనివాస్ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టు పడ్డారు. ములుగు జిల్లా దగ్గర శ్రీనగర్ కు చెందిన గుగులోతు లచ్చిరాం పరిశ్రమల శాఖ నుంచి గత సంవత్సరం రూ.53 లక్షల విలువచేసే అశోక్ లైల్యాండ్ లారీని సబ్సిడీపై తీసుకున్నాడు. ఇందుకు గాను రూ.23 లక్షల సబ్సిడీని రిలీజ్ చేసేందుకు మేనేజర్ రూ.1.10 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా గతంలో రూ.50వేలను ముట్టచెబ్బారు. ఈ మేరకు మేనేజర్ కార్యాలయంలో ఏసోబుని సంప్రదించి మిగిలిన డబ్బుల్లో రూ.15వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్స్పెక్టర్లు శ్యాంసుందర్, రవి, శ్రీనివాస్ దాడి నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. డబ్బులు రికవరీ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం గంగాధర శ్రీనివాస్ ను రిమాండ్ కు తరలించారు.

## రాజరాజేశ్వరి అవతారంలో భద్రకాళి



**వరంగల్ వాయిస్, కల్చరల్ :** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరి (రాజరాజేశ్వరి) అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం పల్లకి సేవ, సాయంకాలం శేషవాహన సేవ జరిపారు. పల్లకి సేవలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు సమస్త భోగాలు కలుగుతాయని, శేషవాహనంపై సేవించిన అమ్మవారి దర్శనంతో యోగ సిద్ధి కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారిని తెలంగాణ జోన్ అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ కమిషనర్ విశాలి దయాళ్, రీజినల్ ఫీఎఫ్ కమిషనర్ ప్రణీత్ జోషి, రవికుమార్ తదితరులు దర్శించుకోగా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కె.శేషుభారతి వారికి శేష వస్త్రములు బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

## స్వేచ్ఛగా బతుకమ్మ జరుపుకోవాలి

**ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లను గురువారం రాత్రి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ కిమిటీకి తగు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉత్సవాల కోసం కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ పడిన శ్రమ అనిర్వచనీయమైనదని కొనియాడారు. గతంలో ఓసిటీలో బతుకమ్మ వేడుకలు జరిగేవన్నారు. అయితే అక్కడ బతుకమ్మ వేడుకలు జరిపేందుకు స్థానికుల అనుమతులు తీసుకోవాల్సి వచ్చేదన్నారు. 2021 సంవత్సరంలో అక్కడి వాళ్ళకు తానే స్వయంగా ఉత్తరం రాసి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రూ.40లక్షలు వెచ్చించి 15రోజుల్లో మొరంతో ఈ ప్రాంతమంతా నింపి బతుకమ్మ, దసరా పండుగను జరుపుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అదే విధంగా రూ.27కోట్లతో చిన్న వడ్డేపల్లి బండ్ అభివృద్ధి జరుగుతుందన్నారు. భవిష్యత్ లో ఈ బతుకమ్మ ప్రాంగణాన్ని పెద్ద ఆస్తి గా ఈ ప్రాంత ప్రజలకు నిలబెడతానన్నారు. నియోజకవర్గ ఆడపడుచులంతా బతుకమ్మ,దసరా పండుగ సంతోషంగా జరుపుకోవాలని పండుగకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ముందస్తు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, దసరా ఉత్సవ కమిటీ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com